268వ అధ్యాయం

٢٦٨ ـ بَابُ النَّهْيِ عَنِ الْإِيذَاءِ

ఇతరులను బాధ పెట్టరాదు

قَالَ اللهُ تَعالَى: ﴿ وَالَّذِينَ يُؤْذُونَ الْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ بِغَيْرِ مَا اكْتَسَبُوا فَقَدِ احْتَمَلُوا بُهْتَانًا وَإِثْمًا مُبِينًا ﴾ [الأحزاب: ٥٨].

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఏ తప్పూ చేయకపోయినా విశ్వాసులైన స్త్రీ పురుషులకు మనస్తాపం కలిగించేవారు, ఒక పెద్ద అభాండభారాన్ని, ఒక స్పష్టమైన పాప భారాన్ని తమ తలపై మోపుకున్నట్లే."

(అహ్‌జాబ్:58)

١٥٦٧ ـ وعنْ عبدِ اللهِ بنِ عَمرِو بنِ العَاصِ رَضِيَ اللهُ عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «المُسْلِمُ مَنْ سَلِمَ المُسْلِمُونَ مِنْ لِسَانِهِ وَيَدِهِ، وَالمُهَاجِرُ مَنْ هَجَرَ مَا نَهَى اللهُ عَنْهُ» متفقٌ عليه.

1567. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవడి నోటి మూలంగా, చేతుల మూలంగా ఇతర ముస్లింలు బాధపడకుండా ఉంటారో అతనే (నిజమైన) ముస్లిం. అలాగే దేవుడు వదలిపెట్టమన్న వాటిని వదలిపెట్టేవాడే ముహాజిర్ (దైవమార్గంలో వలసపోయేవాడు. ముహాజిర్ అంటే వదలిపెట్టేవాడని నిఘంటువు అర్థం.)

(బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని ఈమాన్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ఈమాన్ ప్రకరణం)

ముఖ్యాంశాలు

పైకి చెప్పుకోవటానికి షహాదత్ కలిమా (సాక్ష్యవచనం) పలికి ఒకే దేవుణ్ణి, ముహమ్మద్ దైవప్రవక్త అన్న విషయాన్ని అంగీకరించిన వారందరూ ముస్లింలే. అయితే వాస్తవానికి ముస్లిం అంటే అతని నీతినడవడికలు తన వాక్కర్మల ద్వారా ఇతరులకు బాధకలిగించనంత గొప్పవిగా ఉండాలి. అదే విధంగా సాధారణంగా దైవం కోసం తన స్వదేశాన్ని, ఆత్మీయుల్ని, బంధు

మిత్రుల్ని వదలిపెట్టి ధర్మాన్ని సులభంగా ఆచరించటానికి అనువున్న ప్రదేశానికి తరలి వెళ్ళేవాణ్ణి 'ముహాజిర్' అని అంటారు. కాని వాస్తవానికి దైవాజ్ఞమేరకు పాపకార్యాలను వదలిపెట్టేవాడు కూడా ముహాజిర్‌గానే పరిగణించబడతాడు. ఎందుకంటే హిజ్రత్‌కు అసలు అర్థం 'వదలిపెట్టటమని'. అది స్వదేశాన్ని వదలిపెట్టటమయినా కావచ్చు, లేక పాపకార్యాలను వదలిపెట్టటమయినా కావచ్చు.

١٥٦٨ ـ وعنهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ أَحَبَّ أَنْ يُزَحْزَحَ عَنِ النَّارِ، وَيُدْخَلَ الجَنَّةَ، فَلْتَأْتِهِ مَنِيَّتُهُ وَهُوَ يُؤْمِنُ بِاللهِ وَاليَوْمِ الآخِرِ، وَلْيَأْتِ إِلَى النَّاسِ الذي يُحِبُّ أَنْ يُؤْتَى إِلَيْهِ» رواه مسلم. وَهُوَ بَعْضُ حَدِيثٍ طَوِيلٍ سَبَقَ فِي بَابِ طَاعَةِ وُلَاةِ الأُمُورِ.

1568. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ఎవరయితే నరకాగ్ని నుండి రక్షించబడి స్వర్గానికి పంపబడాలనుకుంటున్నాడో అతనికి తాను దేవుణ్ణి, అంతిమ దినాన్ని విశ్వసిస్తూ ఉన్న తరుణంలో మరణం సంభవించాలి. ఇంకా అతను తన పట్ల ఉత్తమ వ్యవహారం జరగాలని కోరుకుంటున్నట్లుగానే ప్రజల పట్ల కూడా ఉత్తమంగా వ్యవహరిస్తూ ఉండాలి. (ముస్లిం)

ఇది ఇంతకుముందు 'అధికారుల పట్ల విధేయత' అనే అధ్యాయం క్రింద వచ్చిన సుదీర్ఘ హదీసులోని ఒక భాగం.

(సహీహ్ ముస్లింలోని ఇమారత్ ప్రకరణం)

ముఖ్యాంశాలు

ఈ హదీసు ఇంతకుముందు 6వ అధ్యాయంలోని 668వ హదీసు క్రింద ప్రస్తావనకు వచ్చింది. ఇందులో విశ్వాసం మీద నిలకడతనాన్ని, సదాచరణ విషయంలో శాశ్వతతత్వాన్ని అలవర్చుకోవాలని తాకీదు చేయబడింది. మనిషికి మరణం ఎప్పుడు సంభవిస్తుందో తెలీదు. అందుకని మనిషికి విశ్వాసస్థితిలో మరణం సంభవించాలంటే దానికోసం అతను ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వాసం కోరే విషయాలనూ, సదాచరణనూ నిర్లక్ష్యం చేయరాదు. దివ్యఖుర్ఆన్‌లో ఒకచోట, "మీరు ముస్లింలుగా ఉన్న స్థితిలోనే మరణించాలి" అని ఉంది (ఆలి ఇమ్రాన్:102). ఈ హదీసు సరిగ్గా ఆ భావానికే అద్దం పడుతోంది.

2) ఒక ముస్లిం, ప్రజలు తన పట్ల ఉత్తమంగా వ్యవహరించాలని కోరుకునేటట్లుగానే తాను కూడా ప్రతి ఒక్కరి పట్ల మంచిగా మెలగాలి.